# టీ-మీడియా

Digital, tmedia.net.in

నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...

11వ వార్షికోత్సవం 2016 - 2026 మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

బుధవారం 26/08/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## ఇందిరమ్మ ఇళ్ల డ్రా తేదీలు ఖరారు

**⏭ మంత్రి పొంగులేటి నివాసరెడ్డి సమీక్ష**




**టీ మీడియా, ఆగస్టు 25, హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు 40,900 మంది అర్హులను గుర్తించినట్లు రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ నెల 28 నుంచి నాలుగు రోజుల పాటు లాటరీ ద్వారా ఇళ్లు కేటాయించనున్నట్లు చెప్పారు. ఇళ్లు రాని వారికి రూ.10 వేలు తిరిగి ఇస్తామని మంత్రి తెలిపారు. టవర్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. ఎల్బీనగర్, గోషామహల్, నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల కోసం సెప్టెంబరు 3 వరకు దరఖాస్తు చేసుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.ఇందిరమ్మ టవర్ల నిర్మాణం, దరఖాస్తులు, లాటరీ ప్రక్రియపై సచివాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. క్యూర్‌లోని 16 నియోజకవర్గాల్లో రూ.807 కోట్ల 40 లక్షలతో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్ల కోసం 60,720 మంది దరఖాస్తు చేశారు. దరఖాస్తుల్లో 40,900 మంది అర్హులు 19,820 అనర్హులుగా తేలినట్లు మంత్రి తెలిపారు.

## మూసీ ప్రాజెక్ట్ భూసేకరణ వేగవంతం




**⏭ అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు**

**టీ మీడియా, ఆగస్టు 25, హైదరాబాద్ బ్యూరో :** మూసీ ప్రాజెక్టు ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని బోధి పెవెలియన్‌లో మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. మూసీ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సీఎం తెలిపారు. ల్యాండ్ పూలింగ్?తో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణపై స్పష్టమైన విధానం తయారు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. భూసేకరణలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. మూసీ ప్రాజెక్టు రెండో దశకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

తక్కువ వడ్డీ రుణాలపై దృష్టి సారించాలి మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం వెంటనే టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కోసం తక్కువ వడ్డీకి రుణాల సమీకరణపై దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్లకు దిశానిర్దేశం చేశారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్కుకు మరింత ప్రచారం కల్పించాలన్నారు. టీడీఆర్‌పై ప్రతీ వారం సమీక్ష జరగాలని సీఎం స్పష్టం చేశారు.

సమీక్షలో ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, సర్ఫరాజ్ అహ్మద్, ఆర్వీ కర్ణన్, వినయ్?కృష్ణా రెడ్డి, సృజన, నారాయణ రెడ్డి, మను చౌదరి, నరసింహ రెడ్డి, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

# యాక్షన్ తీసుకోవాలని కమిటీ సిఫార్సు

**⏭ కొండా సురేఖ, చిన్నారెడ్డిపె వేటు తప్పదా?**

**⏭ పీసీసీ అధ్యక్షుడికి నివేదిక**

**టీ మీడియా, ఆగస్టు 25, హైదరాబాద్ బ్యూరో :** మంత్రి కొండా సురేఖ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని వ్యవహారంలో ఆ పదవుల నుంచి తొలగించాలని ఏఐసీసీకి పీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ పూర్తి స్థాయి నివేదికను పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్‌కు అందించింది. పార్టీ గీతను దాటి వ్యవహరించిన నేతలపై చర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొన్నట్లు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు.

**పీసీసీ చీఫ్?కు నివేదిక**

చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండాసురేఖ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారం ఏఐసీసీ కోర్టుకు చేరింది. కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్, చిన్నారెడ్డి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారడంతో విచారణ చేపట్టిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ నివేదికను సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చిన క్రమశిక్షణ కమిటీ పూర్తి స్థాయి నివేదికను పీసీసీ చీఫ్?కు అందచేసింది. ఎమ్మెల్యే క్వార్టర్స్?లో మహేష్ కుమార్ గౌడ్?ను కలిసిన



క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి, వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్‌లు నివేదికను సమర్పించారు.

పార్టీకి నష్టం వాటిల్లకుండా చూడాలి క్రమశిక్షణా కమిటీ గత నాలుగు రోజులుగా ఈ ఇద్దరిపై ఇచ్చిన విజ్ఞప్తులతో పాటు, ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా నిశితంగా పరిశీలించింది. షోకాజ్ నోటీసులకు అటు కొండా సురేఖ, ఇటు చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలను కూడా ఒకటికి రెండుసార్లు అధ్యయనం చేసింది. అనంతరం ప్రాథమిక నివేదిక అనంతరం పూర్తిస్థాయి నివేదికను పీసీసీకి అందజేసింది. ఇందులో ప్రధానంగా పార్టీ గీత దాటిన ఆ ఇద్దరినీ పదవుల నుంచి తొలగించాలని సిఫారసు చేసినట్లు తెలుస్తోంది.మంత్రి కొండా (మిగతా 2లో)

## పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ స్కూల్ బస్సు



**⏭ విద్యార్థికి గాయాలు**

**టీ మీడియా, ఆగస్టు 25, విజయనగరం :** విజయనగరం జిల్లా రేగిడి మండలం తునివాడ గ్రామ సమీపంలో ఓ ప్రైవేట్? స్కూల్? బస్సు బోల్తా పడింది. విద్యార్థులతో వెళుతుండగా బస్సు స్టీరింగ్ వీల్ జామ్ అయ్యింది. దీంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్, మరో ఐదుగురు పిల్లలు సురక్షితంగా బయటపడగా, ఒక విద్యార్థినికి గాయాలయ్యాయి. ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే గాయపడిన విద్యార్థిని చికిత్స కోసం రాజంలోని ఆసుపత్రికి తరలించారు.

**ఆస్పత్రికి విద్యార్థి**

స్టీరింగ్ వీల్ జామ్ కావడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. 9వ తరగతి విద్యార్థిని మిథున గాయపడటంతో ఆమెను అంబులెన్స్‌లో రాజంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సిబ్బంది వెంటనే ఆమెను చేర్చుకుని చికిత్స అందించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మిగతా పిల్లలు సురక్షితంగా ఉన్నట్లు తెలుస్తోంది. స్టీరింగ్ వీల్ జామ్ కావడం వల్ల బస్సు అకస్మాత్తుగా అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిందని విద్యార్థులు తెలిపారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించేందుకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

## శ్రీశైలంలో విషాదం..



**⏭ ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి ఆత్మహత్య!**

**టీ మీడియా, ఆగస్టు 25, నంధ్యాల :** నంధ్యాల జిల్లా శ్రీశైలం వడ్డెర ప్రైవేట్ అన్నదాన సత్రంలో కుటుంబం ఆత్మహత్య చేసుకుంది.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు.. సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన కుటుంబంగా గుర్తింపు.. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని పోలీసుల (మిగతా 2లో)

## 'కులగణన ప్రశ్నలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి

**⏭ మోదీకి ఖర్గే, రాహుల్ లేఖ**



**టీ మీడియా, ఆగస్టు 25, ఢిల్లీ బ్యూరో :** దేశంలో చేపడుతున్న కులగణన విధానంపై కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని మరోసారి ప్రశ్నించారు. కులగణన కోసం ప్రస్తుతం రూపొందించిన ప్రశ్నావళిని పూర్తిగా రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. (మిగతా 2లో)

## జీహెచ్ఎంసీ పోరుకు ముహూర్తం ఖరారు

**⏭ డిసెంబర్‌లో రెండో దశ మున్సిపల్ ఎన్నికలు!**

**టీ మీడియా, ఆగస్టు 25, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణలో రెండో దశ మున్సిపల్ ఎన్నికలకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వచ్చే డిసెంబర్ నెలలో హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లతో పాటు మిగిలిన పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ-అర్బన్ లోకల్ బాడీ)లకు ఎన్నికలు నిర్వహించాలని సర్కారు యోచిస్తోంది. దీంతో పురపాలక శాఖ అధికార వర్గం అప్రమత్తమైంది. ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి పెట్టింది.

'సర్' ప్రక్రియ అక్టోబర్ 19వ తేదీతో పూర్తి కానున్న నేపథ్యంలో ఆ తర్వాత కాస్త సమయం



తీసుకొని ఎన్నికలకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. (మిగతా 2లో)

# జీహెచ్ఎంసీ పోరుకు ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)
ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అప్పటికి జీహెచ్ఎంసీతో పాటు వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల కాలపరిమితి పూర్తి కాకపోవడంతో వాటికి మాత్రం ఎన్నికలు నిర్వహించలేదు. వివిధ కారణాలతో కొత్తూరు, సిద్దిపేట, మందమర్రి, మణుగూరు, అచ్చంపేట, నకిరేకల్ మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు జరగలేదు. ఇప్పుడు వీటన్నింటికీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

కాలపరిమితి ముగిసిన అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 10తో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాలపరిమితి ముగిసింది. ఆ తర్వాత పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం జీహెచ్ఎంసీని 3 మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. హైదరాబాద్ కార్పొరేషన్‌ను కొనసాగిస్తూనే శివార్లలో విలీనమైన మున్సిపాలిటీలతో కలిపి కొత్తగా సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్లు ఒకే పరిధిలో ఉండాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ విభజన జరిగింది. వాస్తవానికి కాలపరిమితి ముగిసిన 6 నెలల్లోనే వీటికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే పునర్ వ్యవస్థీకరణ కారణంగా ఎన్నికల నిర్వహణ వాయిదా పడింది.

సర్ ప్రక్రియ కొనసాగుతుండటంతో ఇప్పుడు వీటితో పాటు మొదటి దశలో ఎన్నికల ప్రక్రియ పూర్తికాని పట్టణ స్థానిక సంస్థలకు డిసెంబర్?లో ఎన్నికలు నిర్వహించాలని సర్కార్ ఆలోచిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో సర్ ప్రక్రియ కొనసాగుతుండటంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది అంతా అందులోనే నిమగ్నమై ఉన్నారు. ఇది పూర్తయ్యాక కాస్త విశ్రాంతి ఇచ్చి, ఎన్నికలకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలిసింది. పైగా అప్పటికి వాతావరణం కూడా కాస్త అనుకూలిస్తుందని భావిస్తోంది. .

తాగు నీటి సమస్య, విద్యుత్తు అంతరాయాలు కూడా చాలా మేర తగ్గే అవకాశం ఉంటుంది. అన్నింటి కంటే ముఖ్యంగా ఎన్నికలకు ప్రజలను సమాయత్తం చేయడానికి సమయం కూడా లభిస్తుంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని డిసెంబర్?లో ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని పురపాలక శాఖ అధికారులకు చూచాయగా వెల్లడించడంతో వారు ఎన్నికల నిర్వహణపై సమాయత్తం అవుతున్నారు.

# 'కులగణన ప్రశ్నలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి

(మొదటి పేజీ తరువాయి)
ప్రస్తుతం జరుగుతున్న విధానాన్ని తాము అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. కులగణనలో ఓపెన్ ఎండెడ్ ప్రశ్నల విధానం తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు.

**ప్రధానికి మూడోసారి లేఖ**

కులగణన అంశంపై ఖర్గే, రాహుల్ గాంధీ ఆగస్టు 20న హిందీలో ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఈ లేఖ వివరాలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మీడియాకు వెల్లడించారు. ఈ అంశంపై కాంగ్రెస్ నాయకత్వం ప్రధానమంత్రికి లేఖ రాయడం ఇది మూడోసారి అని తెలిపారు. అయితే ఇప్పటివరకు ప్రధాని నుంచి ఎలాంటి సమాధానం రాలేదని చెప్పారు. ప్రస్తుత కులగణన ప్రక్రియలో తీసుకుంటున్న చర్యలు కేవలం 'వైట్‌వాష్' మాత్రమేనని జైరాం రమేశ్ విమర్శించారు. కులాల వాస్తవ సంఖ్య, సామాజిక–ఆర్థిక పరిస్థితిని కచ్చితంగా అంచనా వేయాలంటే సరైన విధానంలో కులాల వివరాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని ఖర్గే, రాహుల్ తమ లేఖలో పేర్కొన్నారు.

**'ఓపెన్ ఎండెడ్' ప్రశ్నతో సమస్యలు**

ప్రస్తుతం కుల వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఓపెన్ ఎండెడ్ ప్రశ్నావళి విధానాన్ని ఎంచుకుందని కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అంటే వ్యక్తి తన కులం పేరును ఏ విధంగా చెబితే అదే పేరును నమోదు చేస్తారని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఒకే కులానికి వేర్వేరు పేర్లు, ఉపకులాల పేర్లు, భాషాపరమైన భేదాలతో కూడిన పేర్లు ఉన్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకే కులానికి చెందిన వ్యక్తులు వేర్వేరు పేర్లతో నమోదు అయితే, ఒక కులం అనేక వేర్వేరు కులాలుగా విడిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కులగణనలో వేలాది, లక్షలాది వేర్వేరు కులపేర్లు నమోదయ్యే ప్రమాదం ఉందని, అలా జరిగితే సేకరించిన డేటా ఉపయోగకరంగా ఉండదని పేర్కొన్నారు.

**ఓబీసీ జనాభాపై ప్రభావం**

కులాల జనాభా కచ్చితంగా నమోదు కాకపోతే ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితిపై చేసే అంచనాలు కూడా తప్పుగా మారతాయని కాంగ్రెస్ నేతలు అన్నారు. ముఖ్యంగా వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన వర్గాలు, ఇతర అణగారిన సముదాయాలకు దీనివల్ల నష్టం కలగవచ్చని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయ విధానాలకు సంబంధించిన నిర్ణయాలపై కూడా దీని ప్రభావం పడుతుందని ఖర్గే, రాహుల్ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా ప్రస్తుత ప్రశ్నావళి విధానంలో దేశంలోని ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అనేది స్పష్టంగా తేలే అవకాశం లేదని వారు పేర్కొన్నారు. కులగణనలో బ్యాక్‌వర్డ్ క్లాస్ అనే పదమే చేర్చలేదని వారు లేఖలో ప్రస్తావించారు.

**డ్రాప్‌డౌన్ జాబితాతో పరిష్కారం**

ఈ సమస్యకు సులభమైన పరిష్కారం ఇప్పటికే ఉందని ఖర్గే, రాహుల్ సూచించారు. కులాల పేర్లతో ముందుగానే డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించి, అందులో నుంచి సంబంధిత కులాన్ని ఎంపిక చేసే విధానాన్ని తీసుకురావాలని కోరారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వివరాలను నమోదు చేసే సమయంలో ఇదే తరహా విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు.ం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు సంబంధించిన ప్రభుత్వ జాబితాలు, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వంటి ఇప్పటికే అందుబాటులో ఉన్న జాబితాల ఆధారంగా కులాల జాబితాను రూపొందించవచ్చని సూచించారు. తెలంగాణ, బిహార్‌లో నిర్వహించిన కుల సర్వేల విధానాన్ని కేంద్రం పరిశీలించాలని ఖర్గే, రాహుల్ కోరారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ కులాల జాబితాను ఉపయోగించి వివరాలు సేకరించిన విషయాన్ని వారు ప్రస్తావించారు.

తమ లేఖకు తెలంగాణ కుల సర్వే–2024, బిహార్ కుల సర్వే–2022లో ఉపయోగించిన కులాల జాబితాల ప్రతులను కూడా జత చేసినట్లు తెలిపారు.

# కారేపల్లిలో వన మహోత్సవం

● **మొక్కలు నాటిన డీఎల్పీఓ రాంబాబు**

**టీ మీడియా,ఆగస్ట్25,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లిలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.సంత సమీపంలోని ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో డీఎల్పీఓ రాంబాబు పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా డీఎల్పీఓ రాంబాబు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి,ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో



సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ),తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు,ఎంపీడీవో పద్మ,ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్,ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి,జీపీ కార్యదర్శి నెహ్రూ పాల్గొన్నారు.

# జంతువుల కొవ్వుతో వంట నూనె తయారీ

**టీ.మీడియా.ఆగస్టు25. ముదిగొండ :** వంట నూనెల్లో కల్తీకి పాల్పడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఘటన ఖమ్మం జిల్లాలో వెలుగులోకి వచ్చింది. ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామంలోని ఓ ఇంట్లో పశువుల కొవ్వు, వ్యర్థాలతో వంట నూనెను కల్తీ చేస్తున్నట్లు గ్రామస్థులు గుర్తించారు. సమాచారం మేరకు గ్రామస్థులు అక్కడికి చేరుకుని కల్తీ తయారీని అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి, అక్కడ ఉన్న నూనె డబ్బాలతో పాటు పశువుల మాంసాన్ని స్వాధీనం చేసుకుని ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిసింది. పశువుల వ్యర్థాలు, ఎముకలు, కొవ్వును తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని మరిగించి, వివిధ రకాల ప్రక్రియల ద్వారా నూనెగా తయారు చేస్తున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ నూనెను ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరికి విక్రయిస్తున్నారు? ఎంతకాలంగా ఈ వ్యవహారం కొనసాగుతోంది? అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేయాల్సి ఉంది. కాగా, ఇలాంటి కల్తీ నూనెలు మార్కెట్లోకి చేరితే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. పూర్తి వివరాలు అధికారుల విచారణ అనంతరం వెల్లడికావాల్సి ఉంది.





# యాక్షన్ తీసుకోవాలని కమిటీ సిఫార్సు

(మొదటి పేజీ తరువాయి)
సురేఖ కుమార్తె కొండా సుశ్మిత పటేల్ పార్టీ నియమావళిని దాటి మాట్లాడడం మొదటిసారి కాదని పేర్కొంది. గతంలో రెండుసార్లు ఇదే తీరుగా మాట్లాడారని, మూడోసారి కూడా ఇదే రీతిలో కొండా సురేఖ కుటుంబం వ్యవహరించినట్లు పేర్కొంది. ఇప్పటికీ ఉపేక్షిస్తే పార్టీకి తీరని నష్టం వాటిల్లుతుందని కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించి, భవిష్యత్తులో పార్టీకి నష్టం వాటిల్లకుండా చూడాలని సూచించినట్లు క్రమశిక్షణ కమిటీ సూచించినట్లు సమాచారం.

# శ్రీశైలంలో విషాదం..

(మొదటి పేజీ తరువాయి)
అనుమానిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించిన పోలీసులు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.నంద్యాల జిల్లా శ్రీశైలంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. వడ్డెర ప్రైవేట్ అన్నదాన సత్రంలోని ఓ గదిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. మృతులను సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామంలోని వడ్డే కాలనీకి చెందిన పల్లపు సుధాకర్ (36), పల్లపు ఆదిలక్ష్మి, ఆదిలక్ష్మి (50), మల్లేశ్వరి (45), శ్రీదేవి (33), మణికంఠ (15)గా పోలీసులు గుర్తించారు. మృతుల్లో ఒకరు బాలుడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. ఆగస్టు 20వ తేదీన ఐదుగురు కలిసి ఆటోలో శ్రీశైలానికి చేరుకున్నారు. వడ్డెర ప్రైవేట్ అన్నదాన సత్రంలో 11వ నంబర్ గదిని తీసుకుని అక్కడే బస చేశారు. అయితే మూడు రోజులుగా గది నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో సత్రం నిర్వాహకులకు అనుమానం వచ్చింది. గది నుంచి దుర్వాసన రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలుపులు తెరిచి చూడగా భయానక దృశ్యం కనిపించింది. బాత్రూమ్‌లో ముగ్గురు మహిళలు ఉరివేసుకుని ఉండగా, గదిలోని ఫ్యాన్‌కు ఇద్దరు పురుషులు ఉరివేసుకున్న స్థితిలో కనిపించారు. దీంతో పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల్లో పల్లపు సుధాకర్ సుమారు 36 ఏళ్ల వయసున్న వ్యక్తిగా, పల్లపు ఆదిలక్ష్మి, పల్లపు మల్లేశ్వరి, పల్లపు శ్రీదేవి, గోగుల మణికంఠగా పోలీసులు గుర్తించారు. వీరంతా బత్తలపల్లి ప్రాంతంలో నివసిస్తున్నట్లు తెలిపారు.కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం.. సుమారు నెల రోజుల క్రితం గోగుల శ్రీదేవికి పక్షవాతం రావడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు విరూపాక్షపురానికి వెళ్లారు. అక్కడి నుంచి ఐదుగురూ కలిసి శ్రీశైలానికి వెళ్లినట్లు తెలుస్తోంది. బంధువులు ఫోన్‌లో మాట్లాడిన సమయంలో తాము శ్రీశైలంలో ఉన్నామని చెప్పినట్లు సమాచారం.అయితే ఐదుగురూ ఒకేసారి ఆత్మహత్యకు పాల్పడటానికి అసలు కారణం ఏమిటన్నది ప్రస్తుతం మిస్టరీగా మారింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఈ దారుణానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే మృతుల బంధువులకు కూడా ఆత్మహత్యకు కచ్చితమైన కారణం తెలియదని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసిన శ్రీశైలం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. గది నుంచి లభించిన ఆధారాలు, ఫోన్ కాల్ వివరాలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నారు.

# అర్ టి సి అధికారుల ముందస్తు చర్యలు



**టీ మీడియా, ఆగస్టు 25 ,పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని బస్ స్టాండ్ లో సీ సి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం అయ్యాయి ఈ ప్రక్రియలో బాగంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అర్ టి సి అధికారులు బస్టాండు బయట షామియానా (టెంట్) ఎర్పాటు చేశారు బస్సులు అక్కడి నుంచే రాక పోకలు సాగుతున్నాయి అర్ టి సి అధికారుల ఏర్పాట్ల పై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలి



**టీ మీడియా ,ఆగస్టు 25, ఆత్మకురు :** వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 8వ వార్డు ఈద్గా ప్రాంగణంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ మరియు ఆరోగ్యకరమైన వాతావరణం కోసం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటువంటి మెగా ప్లాంటేషన్ కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి. నాగమణి రాజేష్, వైస్ చైర్మన్ ఎం. శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నరేష్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. నేడు నాటిన మొక్కలు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, చల్లని వాతావరణం, ఆరోగ్యకరమైన జీవనాన్ని అందిస్తాయి. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి చెట్టుగా పెంచాలి అని అన్నారు.వైస్ చైర్మన్ మాట్లాడుతూ, ఆత్మకూర్ పట్టణాన్ని మరింత పచ్చగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ తరఫున నిరంతరం చర్యలు చేపడుతున్నాం. ప్రజలు కూడా మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగస్వాములై మొక్కలను నాటి సంరక్షించాలి" అని పిలుపునిచ్చారు.మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, వనమహోత్సవం సందర్భంగా నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి వాటి పెరుగుదలను పర్యవేక్షిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం, ప్రతి సంస్థ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు,మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

## జిన్నింగ్ మిల్లును సందర్శించిన జిల్లా మార్కెటింగ్ అధికారి



**పత్తి సీజన్‌కు మిల్లును సిద్ధం చేయాలని సూచన**

**టీ మీడియా,ఆగస్ట్25,సింగరేణి(కారేపల్లి):**
కారేపల్లిలోని లక్ష్మీప్రియ కాటెక్ జిన్నింగ్ మిల్లును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం మంగళవారం సందర్శించి పరిశీలించారు.పత్తి సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో సీసీఐ కొనుగోలు కేంద్రం నిర్వహణకు అనుగుణంగా జిన్నింగ్ మిల్లును సిద్ధం చేయాలని మిల్లు యాజమాన్యానికి సూచించారు.పత్తి జిన్నింగ్‌కు అవసరమైన యంత్రాలను తనిఖీ చేసి,అవసరమైన మరమ్మతులు చేయించి పూర్తిస్థాయిలో పని చేసేలా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.జిన్నింగ్ మిల్లు యాజమాన్యం మారిన నేపథ్యంలో కొత్త యాజమాన్యానికి ఓనర్‌షిప్ మార్పిడి ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం జిన్నింగ్ మిల్లులో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న బస్తాలను నిల్వ చేశారు.ప్రభుత్వం టెండర్ ద్వారా మొక్కజొన్నను విక్రయించడంతో టెండర్ పొందిన కొనుగోలుదారుడు లారీల ద్వారా మొక్కజొన్న బస్తాలను తరలిస్తున్నారు.ఈ నేపథ్యంలో తరలిస్తున్న మొక్కజొన్నపై నిబంధనల ప్రకారం మార్కెట్ ఫీజు వసూలు చేయాలని స్థానిక మార్కెటింగ్ అధికారులను జిల్లా మార్కెటింగ్ అధికారి ఆదేశించారు.డీఎంవో వెంట సూపర్‌వైజర్ ఎన్.శ్రీనివాసరావు,సీహెచ్ లక్ష్మయ్య,ఎస్కే మున్నీర్ తదితరులు పాల్గొన్నారు.

# నాయకుల్ని సన్మానించిన విద్యార్థులు

**టీ మీడియా, ఆగస్టు 25, ఆత్మకూరు:**
ఆత్మకూరు పట్టణంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నూతన విద్యార్థుల ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డిఆత్మకూరులోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన నూతన విద్యార్థుల ఆహ్వాన కార్యక్రమంలో ఆత్మకూరు మండల బిజెపి నాయకులు పాల్గొనడం జరిగింది గతంలో ఈ కళాశాలలో తాగునీటి ఇబ్బంది ఉందని బిజెపి మండల నాయకులు లక్ష్మి కాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో తన సొంత డబ్బుతో 3 బోర్లు వేయించి కళాశాలకు తాగునీటి సమస్యను తీర్చడం జరిగింది అందుకు కళాశాల బృందం వారిని ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మానించి అభినందనలు తెలియజేయడం జరిగింది కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి గారు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న రహదారి సమస్య, గ్రీన్ బోర్డు, సీసీ కెమెరాలు, కాంపౌండ్ వాల్, లైబ్రరీ, ల్యాబ్. లను ఎంపీ డీ,కే అరుణమ్మ దృష్టికి తీసుకెళ్లి తక్కువ సమయంలోనే అన్ని పనులను పూర్తి చేస్తానని కమిట్మెంట్ ఇవ్వడం జరిగింది కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు అశోక్ భూపాల్ యాదవ్ మాట్లాడుతూ దాదాపు 2



లక్షల రూపాయలు ఖర్చు చేసి డిగ్రీ విద్యార్థులకు తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసిన లక్ష్మీకాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో ఆత్మకూర్ టౌన్ ప్రెసిడెంట్ మండల సురేష్ కుమార్ మాట్లాడుతూ కళాశాలకు నీటి వసతి తో పాటు కేంద్ర నిధులతో ఇక్కడి ఇతరసమస్యలు తీర్చాలని లక్ష్మీకాంత్ అన్న గారిని కోరడం జరిగింది.కార్యక్రమంలో జిల్లా నాయకుడు కె ఆనంద్ కుమార్ ఆత్మకూర్ రూరల్ టౌన్ అధ్యక్షులు ఎం అశోక్ భూపాల్ యాదవ్ ,మండల 6 వార్డ్ కౌన్సిలర్ పుల్లారి భరత్ ,జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆంజనేయులు ముదిరాజ్ మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్ జిల్లా నాయకులు ఆనంద్ , మాజీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి బాలకృష్ణ ,దండు రవి ఎల్, టి, లక్ష్మీకాంత్ బల్వీర్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య మౌళిక వసతులు కల్పించాలి



**దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**

**టీ మీడియా, ఆగస్టు 25 చిన్న చింతకుంట:**
మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో డీఎంహెచ్ఓ ,వైద్యశాఖ అధికారులతో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమావేశమై నియోజకవర్గంలోని వైద్య సేవలపై సమీక్షించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో అవసరమైన ప్రాంతాల్లో ఎక్కడెక్కడ పి హెచ్ సి లు, సబ్ సెంటర్లు అవసరమో గుర్తించి, పి.హెచ్.సి లు, సబ్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి ప్రపోజల్స్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా మౌలిక వసతులను బలోపేతం చేయడం, ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలు, డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన మందులు (డ్రగ్స్) ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో వైద్యశాఖతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.తదనంతరం దమగ్నాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్ (పి హెచ్ సి) నిర్మాణ పనులు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ గారు డీఎంహెచ్ఓ మరియు వైద్యశాఖ అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారులు ఆయా మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జాగ కోసం జైలు భరో కైనా సిద్ధం

**జర్నలిస్టుల పాదయాత్రకు సంఘీభావం**

**టీ మీడియా,ఆగస్ట్25,సింగరేణి(కారేపల్లి):**
ఇండ్లు,ఇండ్ల స్థలాల కోసం జర్నలిస్టుల కదం తొక్కారు.టీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రం కారేపల్లి చేరుకుంది.కారేపల్లి జర్నలిస్టులు పాదయాత్రకు అపూర్వ స్వాగతం లభించింది.కొమరం భీం సెంటర్ లో కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి ప్రారంభించిన పాదయాత్రకు కారేపల్లి ప్రెస్ క్లబ్ సంఘీభావం ప్రకటించింది.ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు,గుడెల్లి శ్రీనివాసరావు లు సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల కోసం పాదయాత్ర కు శ్రీకారం చుట్టటం అభినందనీయమన్నారు.యూనియన్లకు అతీతంగా ఇండ్ల స్థలాల పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు.సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు,మండల కార్యదర్శ కే.నరేంద్ర, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు సంఘీభావం తెల్పి జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధనకు అండగా ఉంటామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగొడ ఐలయ్య,దిశ కమిటీ సభ్యురాలు దారావత్ హేమలత లు మాట్లాడుతూ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నేతృత్వంలో మండల విలేకరులకు ఇండ్ల స్థలాల సాధిస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు హన్మకొండ రమేష్,రావూరి శ్రీనివాసరావు,బత్తుల శ్రీనివాసరావు,అజ్మీర వీరన్న లు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని



డిమాండ్ చేశారు.సీపీఐ నాయకులు బోళ్ల రామస్వామి,సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు గుమ్మడి సందీఫ్,గుగులోత్ తేజా,న్యూడెమోక్రసీ నాయకులు భూక్య శివానాయక్,అంబేదర్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆదెర్ల రాములు,బీఎస్పీ జిల్లా నాయకులు దామళ్ల సత్యనారాయణ ఆటో యూనియన్ అధ్యక్షులు నాగవెల్లి ప్రభాకర్ లు మాట్లాడరు.

**జాగ కోసం జైల్ భరో కైనా సిద్ధం**

జర్నలిస్టుల ఇండ్ల జాగా కోసం జైల్ భరో కైనా సిద్ధంని, జర్నలిస్టుల న్యాయమైన ఇండ్ల స్థలాల పోరాటం మహత్తరమైందని టీడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఖదీర్,కే.శ్రీనివాసరెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్ లు అన్నారు.పాదయాత్రను ఉద్దేశించి వారు మాట్లాడుతూ జర్నలిస్టుల పాదయాత్రం పార్టీలు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కాదని,సమస్యను పాలకుల దృష్టికి తీసుకరావటం, ప్రజాపాలకులపై ఒత్తిడి తేవటానికేనన్నారు. ఎకార్యక్రమంలో జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, షేక్ జానీ పాషా,టీబీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మానుకొండ రవికిరణ్,రాష్ట్ర కార్య వర్గ సభ్యులు టిఎస్ చక్రవర్తి,స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ నలుబోలు మధుశ్రీ,మారెడ్డి నాగేందర్ రెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు,ఎన్.డి కర్ణ,దగ్గుపాటి మాధవరావు,గరిడేపల్లి వెంకటేశ్వర్లు,కొరకొప్పుల రాంబాబు,కారేపల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు తేళ్ల శ్రీనివాసరావు,కోశాధికారి పాలిక శ్రీను,పగడాల నాగేశ్వపావు,టీడబ్ల్యూజేఎఫ్ మండల నాయకులు బోడ అశోక్,భాగం నాగేశ్వరరావు,తోగల సతీష్,దమ్మాలపాటి కృష్ణ,నాయకులు గణేష్, శరత్, యూసుఫ్, అర్షత్, రవికుమార్,ఇంటి ప్రసాద్, తిరుపతిరావు, పవన్, భవాని, తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతిక ల్యాబ్ ప్రారంభం



**టీ మీడియా, ఆగస్టు 25 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం లోని సుగూర్ ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో సుగూర్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు గ్రామ సర్పంచ్ మండల విద్యాధికారి చేతుల మీదుగా కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యతో అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను మరింత పెంపొందించ వచ్చని అన్నారు సుగూర్ గ్రామం డిజిటల్ విద్య వైపు మరో ముందడుగు వేసిందని పలువురు అభిప్రాయ పడ్డారు ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన జిల్లా అడిషనల్ పిడి : శిరీష

**టీ మీడియా ఆగస్టు 25 కూసుమంచి:**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాలేరు నియోజకవర్గ పరిధి లోని వివిధ గ్రామాలలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కూసుమంచి తోపాటు, నాయకగూడెం గ్రామంలో వి బి జి రాంజీ పథకం ద్వారా హరిత విప్లవ సాధన కోసం ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. మండలంలోని నాయక గూడెం గ్రామంలో జిల్లా అడిషనల్ పీడీ శిరీష , నాయకగూడెం గ్రామ సర్పంచి సైదమ్మతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పిడి శిరీష మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల గ్రామాలు పచ్చదనంతో కలకలలాడతాయని, ఇది మానవ జీవనావళికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, ఈ సందర్భంగా పిడి శిరీష ప్రజలకు సూచించారు. అలాగే కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండ కృష్ణవేణి మహిపాల్, ఏ పి ఓ బాబురావు



ఆధ్వర్యంలో మాస్ ప్లాంటేషన్ నిర్వహించారు. కూసుమంచి రెవెన్యూ పరిధిలోని గురువాయి గూడెం ఎక్స్ రోడ్డు వద్ద కాలువ గట్టుకి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి గ్రామపంచాయతీ కార్యదర్శి నీరజ, ఈ సి కరుణ, గ్రామ ఉపసర్పంచ్ చేన్ను వెంకటరమణ, గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు గుండా ఉపేందర్ రెడ్డి, చెరుకుపల్లి వీరయ్య, బండారుపల్లి రమాదేవి, గోపే వరలక్ష్మి, మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్, కొక్కిరేణి రామనాథం, గ్రామస్తులు కొండ మహిపాల్, ముత్తేశం, బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన

**టీ.మీడియా,ఆగస్టు25,చింతూరు:**
పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చింతూరు మండలం సుద్దగూడెం గ్రామంలో రైతులకు పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులతో కలిసి పండ్ల మొక్కలను నాటారు. పండ్ల చెట్ల పెంపకంతో అదనపు ఆదాయం పొందడంతో పాటు కుటుంబానికి పోషకాహారం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్‌లో స్థిరమైన జీవనోపాధి లభిస్తుందని రైతులకు వివరించారు.పండ్ల మొక్కలను సంరక్షించే విధానం, నీటి వినియోగం, తెగుళ్ల నివారణ, సేంద్రియ పద్ధతులపై కూడా అవగాహన కల్పించారు. రైతులు పండ్ల తోటల సాగును ప్రోత్సహించి దీర్ఘకాలికంగా ఆర్థికంగా లాభపడాలని సంస్థ ప్రతినిధులు సూచించారు.

# ఓటర్లు ఆందోళన చెందవద్దు

**⏭ ఎన్నికల అధికారి అర్జున్ రావు**

**టీ.మీడియా,ఆగస్టు25,చింతూరు,:**

పోలవరం జిల్లా చింతూరు మండలం లోని చట్టి గ్రామంలో 343 బూత్ కు చెందిన ఓటర్లు ఆందోళన చెందవద్దని ఓటు హక్కును కోల్పోవడం జరగదని ఎన్నికల అధికారి జి అర్జున్ రావు తెలిపారు.సోమవారం మీడియా లో వచ్చిన న్యూస్ పై ఓటర్ల ఆందోళన పై అధికారులు స్పందించారు.మంగళవారం ఉదయం చట్టి సచివాలయం వద్ద ఓటు హక్కు పై ఆందోళన చేపట్టిన ఓటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. సర్ ఎన్యుమరేషన్ ఫామ్ లు బి యల్ ఓ , అసిస్టెంట్ బిఎల్ ఓ లు ప్రజలకు అందించకపోవడంతోనే ఈ ఆందోళనకు కారణమని ఆయన అన్నారు. 343 బూత్ కు చెందిన 321 మంది ఓటర్లు ఎటువంటి ఆందోళనకు గురి కావద్దని అన్నారు. బూత్ లో అర్హత కలిగిన ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు ఉంటుందని ఆయన అన్నారు.కొత్తసర్



ఎన్యుమరేషన్ ఫామ్ లు అందించడంలో నిర్లక్ష్యం వహించిన బిఎల్ ఓ , అసిస్టెంట్ బిఎల్ ఓ ల పై జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు ఫిర్యాదు జరిగిందని ఎన్నికల అధికారి అర్జున్ రావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# మాంటిసోరి స్కూల్‌లో ఘనంగా ఓనం వేడుకలు

**⏭ కేరళ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా ఓనం**

**⏭ విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరించిన ప్రిన్సిపాల్ మినీ జోజో**

**టీ మీడియా,ఆగస్ట్25,సింగరేణి(కారేపల్లి):**

కారేపల్లి లోని మాంటిసోరి స్కూల్‌లో మంగళవారం ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు.కేరళ సంస్కృతి,సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్వహించిన వేడుకలు విద్యార్థులు,తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. పండుగ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఓనం విశిష్టతను విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా మాంటిసోరి స్కూల్ ప్రిన్సిపాల్ మినీ జోజో మాట్లాడుతూ ఓనం కేరళ ప్రజల అతిపెద్ద సంప్రదాయ పండుగల్లో ఒకటని తెలిపారు.కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి ఆనందంగా జరుపుకునే పండుగగా ఓనంకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.మహాబలి చక్రవర్తి తన ప్రజలను చూసేందుకు ప్రతి సంవత్సరం ఓనం సందర్భంగా వస్తాడనే విశ్వాసంతో ఈ పండుగను జరుపుకుంటారని



వివరించారు.మహాబలి పాలనలో ప్రజలందరూ సమానంగా,సుఖసంతోషాలతో జీవించారని పురాణ కథనాలు చెబుతున్నాయని,అందుకే సమానత్వం,ఐక్యత,సోదరభావం,సంతోషానికి ఓనం ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.పంటలు చేతికొచ్చే సమయంలో ప్రకృతికి కృతజ్ఞతలు తెలియజేస్తూ జరుపుకునే పంట పండుగగానూ ఓనంకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు.ఓనం సందర్భంగా ఇళ్ల ముందు పూలతో అందంగా తీర్చిదిద్దే పూకళం, సంప్రదాయ విందైన ఓనం సద్య,సంప్రదాయ వస్త్రధారణ,సాంస్కృతిక కార్యక్రమాలు ఈ పండుగలో ప్రధాన ఆకర్షణలని విద్యార్థులకు వివరించారు.భారతదేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు,పండుగల విశిష్టతను విద్యార్థులు తెలుసుకోవడం ద్వారా జాతీయ సమైక్యత భావన పెంపొందుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓనం పండుగ సందేశాన్ని చాటారు.ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓనం పండుగ సందేశాన్ని చాటారు. చిన్నారులు,ఉపాధ్యాయుల ఓనం సంప్రదాయ వేషధారణ వేడుకలకు మరింత శోభను తీసుకురాగా,పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో మాంటిసోరి స్కూల్ ప్రిన్సిపాల్ మినీ జోజో,అధ్యాపకులు,ఇతర సిబ్బంది, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పద్మావతి కాలనీ చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

**టీ మీడియా, ఆగస్టు 25, రామకృష్ణాపూర్;**

క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ పద్మావతి కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.రెడ్డిమల్ల శోభారాణి దంపతులు హైదరాబాద్ వెళ్లగా తాళం పగులగొట్టి 1½ తులాల వెండి గొలుసు, 6 తులాల ముడి వెండి, 3 తులాల నాణేలు, బంగారు పుస్తె గుండు (విలువ రూ.5 వేలు) ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.తిమ్మాపూర్ చౌరస్తాలో వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న సిరికొండ శంకర్ ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడని మంగళవారం ఎస్సై జై శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చోరీ సొత్తును విక్రయించి విలాసాలకు వాడినట్లు




తేలింది.ప్రజలు ఇల్లు తాళం వేసి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

# గోదావరి పులస పేరుతో మోసం

**వలలో చిక్కకపోయినా మార్కెట్‌లో దర్శనం**

**టీ మీడియా, ఆగస్టు 25, గోదావరి :**

గోదావరి జిల్లా అనగానే గుర్తొచ్చే వాటిలో 'పులస' చేపకు ఉండే క్రేజే వేరు. ఈ పేరు వింటేనే మాంసాహార ప్రియుల నోళ్లలో నీళ్లూరుతాయి. పులస రుచి చూసేందుకు ఎంతోమంది వేల రూపాయలు ఖర్చు చేసేందుకు వెనుకాడరు. అయితే ఇదే అదునుగా భావిస్తున్న మోసపూరిత వ్యాపారులు, వినియోగదారులను మాటలతో బురిడీ కొట్టిస్తున్నారు. గోదావరిలో అసలు పులసలే దొరకకపోయినా, వేరే రాష్ట్రాల నుంచి తెచ్చి పులసలంటూ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వలలో చిక్కని పులసలు

కొన్నేళ్ల కిందట గోదావరికి వరద నీరు వచ్చిందంటే చాలు, పులసల సందడి విపరీతంగా ఉండేది. కానీ, గడిచిన కొన్నేళ్లుగా గోదారిలో పులస జాడ కరవైందని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యశాఖ అధికారులూ ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తున్నారు. నరసాపురం నుంచి సిద్ధాంతం వరకు గోదావరిలో వేటాడే మత్స్యకారులను సంప్రదించగా, ఈసారి గోదావరికి కొత్త నీరు వచ్చినా తమ వలలకు ఒక్క పులస కూడా చిక్కలేదని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న గోదావరి జిల్లాల ఎఫ్‌డీవోలను ఆరా తీయగా, గత రెండు మూడు సీజన్ల నుంచి



గోదావరిలో మత్స్యకారుల వలలకు పులసలు చిక్కిన దాఖలాలే లేవని స్పష్టం చేశారు.

మరి మార్కెట్లో కనిపిస్తున్నవి ఏంటి?

గోదావరి జిల్లాల్లో నది పొడవునా 'అసలైన గోదావరి పులసలు' అని బోర్డులు పెట్టుకుని మరీ కొందరు విక్రయిస్తున్నారు. అయితే ఇవి అసలు గోదావరిలో దొరికినవి కానే కాదు. ఒడిశా, బంగాల్ తదితర రాష్ట్రాల నుంచి రోడ్డు మార్గంలో వలస వచ్చిన 'విలసలు' ఇవి. కొన్ని ప్రాంతాల్లో వీటిని 'విలసలు' అని నిజం చెబుతుంటే, మరికొన్ని చోట్ల మాత్రం అచ్చం అసలుసిసలైన పులసలే అంటూ నమ్మబలుకుతూ విక్రయిస్తున్నారు. వినియోగదారుడి బలహీనతను బట్టి కిలో రూ. 2 వేల నుంచి ఏకంగా రూ. 5 వేల వరకు ధర నిర్ణయించి అమ్ముతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు, ప్రయాణికులు వీటిని అసలైన గోదావరి పులసలుగా భ్రమించి రెట్టింపు ధర చెల్లించి మోసపోతున్నారు.

ఎందుకు కనుమరుగవుతున్నాయి?

గోదావరిలో పులసల రాక పూర్తిగా తగ్గిపోవడానికి ప్రధాన కారణాలు ఉన్నాయని మత్స్యశాఖ ఏడీ ఎల్ఎల్ఎన్ రాజు తెలిపారు. నదిలో పూడిక పేరుకుపోవడం, వాటి గమనానికి అనుకూలంగా నీటి ప్రవాహం లేకపోవడం ఇందుకు ప్రధాన కారణమన్నారు. దీనికి తోడు నదిలో పెరుగుతున్న కాలుష్యం, ముఖద్వారాల్లో ఏర్పడుతున్న ఒడుదొడుకుల వల్ల పులసలు గోదావరిలోకి రావడం పూర్తిగా తగ్గిపోయిందని ఆయన స్పష్టం చేశారు. ఏటా సీజన్ వస్తోంది కదా అని కళ్లు మూసుకుని కొనుగోలు చేస్తే మోసపోవడం ఖాయమని, స్థానిక మత్స్యకారుల వద్దే దొరకని పులసలు మార్కెట్లో విరివిగా కనిపిస్తున్నాయంటే అది కచ్చితంగా మోసమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# వైభవంగా 'వన మహోత్సవం

**టీ మీడియా ,ఆగస్టు 25 ,ఆళ్లపల్లి:**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: సర్పంచ్ సుస్మిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విరివిరిగా మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులుపర్యావరణ సమతుల్యతను సాధించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా విరివిరిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సర్పంచ్ వాసం సుస్మిత పిలుపునిచ్చారు.మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏపీవో రఘునాథ్ ఆధ్వర్యంలో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాసం సుస్మిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు.అనంతరం విద్యార్థులకు మొక్కల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణపై ఏపీవో రఘునాథ్ అవగాహన కల్పించారు. చెట్లను పెంచడం ద్వారా వచ్చే ప్రయోజనాలను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాయపాడు సర్పంచ్ ఊకే



ఎర్రయ్య, ఉప సర్పంచ్ ఆరిఫ్, కార్యదర్శి ఉపేందర్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నులకతాటి శ్రీను, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇందు కుమార్, కార్యదర్శి లాలు, మండల నాయకులు పాయం సత్యనారాయణ, భరత్, రవి, సాయి, టీఏ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి కమిటీ సమావేశం



**టీ.మీడియా.ఆగస్టు25. ముదిగొండ :**

ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో మిలాద్–ఉన్–నబీ పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మురళి మాట్లాడుతూ, ప్రజలందరూ మత సామరస్యాన్ని పెంపొందించుకుంటూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎలాంటి విద్వేషాలు, ఘర్షణలకు తావులేకుండా పరస్పర గౌరవం, స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలని, సమాజంలో ఐక్యతను పెంపొందించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు అశోక్, హరిత, ఏఎస్ఐలు అబ్దుల్ కలీఫ్, సాంబశివరావు, పోలీస్ సిబ్బందితో పాటు స్థానిక సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వ్యాధుల నివారణకు పోలీసుల అడుగు

**⏭ ఎస్సై ముత్తినేని సోమేశ్వర్**

**టీ మీడియా ,ఆగస్టు 25 ,ఆళ్లపల్లి :**

ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో దోమతెరలు, సోలార్ దీపాల పంపిణీసీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా పెద్ద వెంకటాపురం గుంపుల్లో పోలీసుల సేవా కార్యక్రమంవర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణే ధ్యేయంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు ఆళ్లపల్లి మండలంలో వినూత్న సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై ముత్తినేని సోమేశ్వర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెద్ద వెంకటాపురం గ్రామ శివారు ప్రాంతాలైన దేవయ్య గుంపు, పాల గుంపు, రాళ్ల గుంపులలో నివసిస్తున్న 43 గుత్తికోయ కుటుంబాలకు దోమతెరలు, సోలార్ విద్యుత్ దీపాలను పంపిణీ చేశారు. కరకగూడేనికి చెందిన దాత పాషా సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

?ఈ సందర్భంగా ఎస్సై ముత్తినేని సోమేశ్వర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో అటవీ ప్రాంతాల్లో దోమల వ్యాప్తి అధికంగా ఉండటం వల్ల మలేరియా, డెంగ్యూ, విషజ్వరాలు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి ప్రతి



ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ సౌకర్యం లేని మారుమూల గుంపుల్లో రాత్రివేళల్లో వెలుగుల కోసం ఈ సోలార్ దీపాలను అందించినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

# వాచ్‌మెన్ దారుణ హత్య..

**⏭ సీసీ కెమెరాల్లో రికార్డైన భయానక దృశ్యాలు..!**

**టీ మీడియా, ఆగస్టు 25, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మహానగర పరిధిలో దారుణ హత్య కలకలం రేపింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేపాల్‌కు చెందిన నాగేందర్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. వాచ్‌మన్‌గా పనిచేస్తున్న నాగేందర్ అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం (ఆగస్టు 24) అర్ధరాత్రి నాగేందర్ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో వెనుక నుంచి యాక్టివా వాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. నాగేందర్‌ను అడ్డగించిన ఇద్దరూ అతడిపై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా కొట్టడంతో నాగేందర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.మరోవైపు, ఉదయం నాగేందర్ ఇంటికి తిరిగి



రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. స్థానికుల సహాయంతో పరిసర ప్రాంతాల్లో వెతకగా.. రోడ్డుపై నాగేందర్ మృతదేహం కనిపించింది. దీంతో స్థానికులు వెంటనే రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. నాగేందర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డైనట్లు గుర్తించారు. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజ్‌తో పాటు హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# ఇంటర్ కూడా పాస్ కాకుండానే డాక్టర్



● హైదరాబాద్‌లో నకిలీ వైద్యుల గుట్టురట్టు ?

**టీ మీడియా, ఆగస్టు 25, హైదరాబాద్ బ్యూరో:**
అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రికి వెళ్లే సామాన్యుడి ప్రాణాలను కాపాడాల్సిన వైద్యమే కొందరికి వ్యాపారంగా మారింది. సరైన విద్య అర్హతలు లేకపోయినా తెల్లకోటు వేసుకుని, స్టెతస్కోప్ మెడలో వేసుకుని ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల బాగోతాన్ని హైదరాబాద్ పోలీసులు బట్టబయలు చేశారు. నగరంలో విస్తృతంగా నిర్వహించిన సోదాలు వైద్య వర్గాల్లోనూ, ప్రజల్లోనూ కలకలం రేపాయి. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలో టాస్క్?ఫోర్స్ పోలీసులు ఏకకాలంలో పలు క్లినిక్‌లపై దాడులు నిర్వహించారు. ఎటువంటి డిగ్రీలు, అనుమతులు లేకున్నా రోగులకు వైద్యం అందిస్తున్న నకిలీ డాక్టర్ల జాడను గుర్తించి అరెస్ట్ చేశారు.

ఏళ్లుగా వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులు హైదరాబాద్‌లో అర్హతలు లేకున్నా డాక్టర్లుగా చెలామణి అవుతున్న పలువురు నకిలీ వైద్యులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ వెల్లడించారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి పన్నెండు మంది నకిలీ డాక్టర్లను గుర్తించినట్లు తెలిపారు. వీరిలో గతంలో కాంపౌండర్?, ల్యాబ్? టెక్నీషియన్?, నర్స్, పారా మెడికల్?గా పని చేసినవారు ఉన్నారని తెలిపారు. ఓ నకిలీ డాక్టర్ కనీసం ఇంటర్మీడియట్? కూడా అర్హత సాధించలేదని టాస్క్?ఫోర్స్ డీసీపీ వెల్లడించారు. వీరు క్లినిక్?ల ద్వారా ఏళ్ల తరబడి ప్రజలకు సెలైన్లు, ఇంజెక్షన్లు మందులతో పాటు కొన్ని సందర్భాల్లో కుట్లు కూడా వేసిన్నట్లు తెలిపారు.

కాలం తీరిన మందులు స్వాధీనం ఎలాంటి అర్హత లేని ఫేక్ డాక్టర్లు నకిలీ డిగ్రీ, ఎంబీబీఎస్ ధ్రువపత్రాలను కూడా సృష్టించినట్లు పోలీసులు తనిఖీలో వెల్లడైంది. ఉత్తర భారత దేశంలోని ఓ యూనివర్సిటీ పేరుతో హైదరాబాద్?లోనే ఫేక్ ఎంబీబీఎస్? సర్టిఫికెట్లను పొందినట్లు గుర్తించారు. వీరికి సహాయం చేసిన వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామని టాస్క్?ఫోర్స్ డీసీపీ స్పష్టం చేశారు. అలాగే వీరి నుంచి గడువు తీరిన పలు రకాల యాంటీబయాటిక్స్, సెలైన్ బాటిళ్లు, సిరంజీలతో పాటు స్టెతస్కోపులు, బీపీ మెషీన్లు, సర్జికల్ కత్తెరలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.నకిలీ వైద్యులకు ఫేక్ సర్టిఫికెట్లు సృష్టిస్తున్నావారు, మందులు సరఫరా చేస్తున్నవారితో పాటు ప్రిస్క్రిప్షన్? పేపర్?ను కూడా ఎవరు తయారు చేసి ఇస్తున్న వారిని కూడా గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. ఫేక్ డాక్టర్లకు, వారికి ప్రోత్సహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పంచాయతీ కార్మికుల సమస్యలపై ఛలో కలెక్టరేట్




**టీ మీడియా, ఆగస్టు 25, ఎర్రుపాలెం :**
గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టరేట్ కు ఎర్రుపాలెం మండల కార్మికులు వెళ్తున్న సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ.. పాలకులు మారినా కార్మికుల సమస్యలు పరిష్కారం అవేదన వ్యాక్తం చేశారు.రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు నర ఏండ్లు అయినప్పటికీ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించలేదని ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ చేయలేదని మండిపడ్డారు.సమస్యల పరిష్కారానికి అనేక సార్లు విన్నవించినా ప్రస్తుతం మండల,జిల్లా కేంద్రాలలో నిరసన దీక్షలు జరుగుతున్నా ప్రభుత్వం వస్పందించకపోవడం సిగ్గుచేటన్నారు.ఇప్పటికైౖ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ, వివిధ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్మికుల అధ్యక్షా కార్యదర్శులు గశీతల నాగేశ్వరావు, కలపాల రవీంద్రా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ డీఎస్పీ అవతారం

● రూ.1.20 కోట్లు స్వాహా చేసిన మోసగాడు అరెస్ట్



**టీ మీడియా, ఆగస్టు 25, హైదరాబాద్ బ్యూరో :**
సమాజంలో పోలీసులకు ఉండే గౌరవాన్ని అడ్డుపెట్టుకుని ఏకంగా డీఎస్పీ అవతారమెత్తాడు ఓ కేటుగాడు. నకిలీ కంపెనీలు సృష్టించి, పెట్టుబడుల పేరుతో అమాయకుల నుంచి రూ.కోట్లు కొల్లగొట్టాడు. పోలీసుల కళ్లుగప్పుతూ, రాష్ట్రాలు దాటుతూ మారువేషాల్లో తిరుగుతున్న ఈ అంతరాష్ట్ర నకిలీ డీఎస్పీని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. టెక్నాలజీ సాయంతో బెంగళూరులో తలదాచుకున్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్?కు తరలించారు. పెట్టుబడుల పేరుతో ఈ నకిలీ డీఎస్పీ ఆడిన హైడ్రామా ఏంటి పోలీసులకు ఎలా చిక్కాడో తెలుసుకుందాం. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన కొండూరు రెడ్డి వెంకట్రాజు అలియాస్ డీఎస్పీ రాజు గతంలో తిరుపతిలో ఓ బ్యాంకులో పనిచేసేవాడు. ఆ సమయంలో ఓ పోలీసు అధికారితో ఏర్పడిన పరిచయంతో పోలీసులకు దక్కే గౌరవం, పలుకుబడి చూసి అతనికి విపరీతమైన ఆశ పుట్టింది. అడ్డదారిలో సునాయాసంగా డబ్బు సంపాదించాలనే దుర్బుద్ధితో బ్యాంకు ఉద్యోగం వదిలేశాడు. ఏకంగా పోలీసు యూనిఫాం కుట్టించుకుని, నకిలీ ఐడీ కార్డులతో డీఎస్పీ అవతారమెత్తాడు. తనను తాను ఏసీబీ డీఎస్పీగా పరిచయం చేసుకుంటూ ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు నమోదు చేసి జైల్లో వేస్తానంటూ బెదిరింపులకు పాల్పడేవాడు.

పెట్టుబడులు పెడితే రూ.కోట్లల్లో మోసం తిరుపతి, నెల్లూరు, హైదరాబాద్?లో మోసాలకు పాల్పడ్డాడు. నెల్లూరులో ట్రేడ్ ప్రాఫిట్ కంపెనీ పేరుతో ఓ నకిలీ సంస్థను స్థాపించి అందులో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయంటూ ప్రజలకు వల వేశాడు. ఇదే తరహాలో 2021లో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి తన కంపెనీలో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని నమ్మించాడు. ఏకంగా రూ.1.20 కోట్లు వసూలు చేసి అక్కడి నుంచి మకాం మార్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు.

ట్రేసింగ్?కు గురికాకుండా సిమ్?లు మార్చేవాడు పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఈ నకిలీ డీఎస్పీ ఎన్నో వ్యూహాలు పన్నాడు. సాంకేతికంగా దొరికిపోకుండా ఉండేందుకు సొంత సిమ్ కార్డులు వాడటం మానేశాడు. అమాయకుల పేర్లతో ఉన్న నంబర్లను, ముఖ్యంగా తన భార్య పేరుతో ఉన్న సిమ్ కార్డును మాత్రమే వాడుతూ ట్రేసింగ్?కు గురికాకుండా బెంగళూరులో తలదాచుకున్నాడు. అయితే ఎన్ని వేషాలు మార్చినా సీసీఎస్ పోలీసుల దర్యాప్తు ముందు ఆటలు సాగలేదు. డీసీపీ చైతన్య కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలను విశ్లేషించి దర్యాప్తును ముమ్మరం చేశాయి. పక్కా సమాచారంతో బెంగళూరులో మాటువేసి మరీ ఈ నకిలీ డీఎస్పీ రాజును ఎట్టకేలకు అరెస్ట్ చేసి హైదరాబాద్?కు తరలించారు. కేవీపీ రాజుపై గతంలో తిరుపతి, వేదాయపాళెం, తుకారాంగేట్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

కీలక ఆధారాలు స్వాధీనం అరెస్ట్ సమయంలో నిందితుడి నుంచి నకిలీ పోలీస్ ఐడీ కార్డులు, ఇతర కీలక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షార్ట్?కట్?లో డబ్బు సంపాదించాలనే దురాశతో, పెట్టుబడుల పేరిట అమాయకుల జీవితాలతో ఆడుకున్న ఈ నకిలీ డీఎస్పీ రాజు వ్యవహారం ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. ఇతని వలలో ఇంకెంతమంది అమాయకులు బలయ్యారో, ఇంకెన్ని కోట్లు వసూలు చేశాడో అని పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. ఇలాంటి నకిలీ అధికారుల మాటలు నమ్మి, అత్యాశకు పోయి పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

# విద్య, వైద్యానికి ప్రభుత్వ ప్రాధాన్యత

● మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**టీ మీడియా, ఆగస్టు 25, ఖమ్మం:**
విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం మంత్రి, స్థానిక జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ. 2375 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాహితం కోసం విద్య, వైద్యం పై పెట్టే ఖర్చు, భవిష్యత్తు పెట్టుబడి అన్నారు. జిల్లాలో వైద్య కళాశాల పూర్తయ్యే నాటికి మనకు ఇంకొక 200 పడకల ఆసుపత్రి కావాలని, అది ఎక్కడ కట్టాలని స్థల నిర్ధారణ చేస్తే, ముఖ్యమంత్రిని అడిగి దాన్ని కూడా మంజూరు చేయిస్తానని తెలిపారు. ఓల్డ్ బిల్డింగ్ శిథిలావస్థలో వుందని, పరిశీలించి, దాన్ని తొలగించడానికి ప్రతిపాదనలు ఇస్తే, మొత్తం స్థలాన్ని ప్రణాళికాబద్ధంగా వినియోగంలోకి తెస్తామన్నారు. ఎక్కువ స్థలం ఇంకా మిగిలిపోయింది దాన్ని ఏ రకంగా వాడుకుంటాం ఈ యొక్క హాస్పిటల్ కి సంబంధించినటువంటి వచ్చే బాధితులు, సహాయకులు సౌకర్యవంతంగా వుండేలా చర్యలు చేపట్టాలన్నారు. పార్కింగ్ ఎక్కడ ఉంటే బాగుంటది, బిల్డింగ్స్ మీద సోలార్ కి వెళ్తే మీ పవర్ ఖర్చులు కూడా లేకుండా చూసుకోవచ్చన్నారు. రోగులకి సకల సౌకర్యాలు ఉండాలని, హైదరాబాదులా ఖమ్మం హాస్పిటల్లో అన్ని సౌకర్యాలు దొరుకుతాయి అనే విశ్వాసాన్ని



నమ్మకాన్ని ఖమ్మం జిల్లా ప్రజలకే కాకుండా చుట్టుపక్కల జిల్లా ప్రజలకి కల్గించాలని అన్నారు.జిల్లా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ కాకుండానే, ఇంకా అవసరమైనటువంటి అన్ని కార్యక్రమాల్ని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నటువంటి వైద్య సౌకర్యాలు మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లగలుగుతానే విశ్వాసంతోటి విద్య, వైద్యం పై చేసే ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడని, ఈ పిల్లలు రేపు ఈ రాష్ట్రానికే కాదు ఈ దేశానికి మనకి ఒక ఆస్తి అని తెలిపారు . డాక్టర్స్ కావచ్చు, ఇంజనీర్స్ కావచ్చు, చదువుకున్నటువంటి ప్రతి బిడ్డ కూడా ఈ దేశం ఆస్తి అందుకనే మనం ఆస్తి మీద పెట్టుబడి పెట్టి ఆస్తిని మనం జాగ్రత్త చేసుకుంటే ఆస్తి ద్వారా ఈ రాష్ట్రం ఈ దేశం సుఖంగా సౌభాగ్యంగా ఉండే అవకాశం ఉంటదని అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల పటిష్టానికి చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రి లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ దుర్గా ప్రసాద్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. శంకర్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మరో పోరాటానికి సిద్ధం కండి

● సిఐటియు, ఎస్ డబ్ల్యూ ఎఫ్ నేతల పిలుపు

**టీ మీడియా, ఆగస్టు 25, ఖమ్మం:**
ప్రభుత్వం ఆర్టీసీ యాజమాన్యం అంగీకరించిన అంశాలను అమలుకు వెంటనే సర్కులర్ విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీ అంగీకరించిన అంశాల అమలు కోసం ఆర్టీసీ కార్మికులు మరో సమస్యల పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు ఖమ్మం జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు కళ్యాణ వెంకటేశ్వర్లు తుమ్మ విష్ణువర్ధన్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర ఉత్తర ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తులు పిలుపునిచ్చారమంగళవారం ఉదయం ఖమ్మం బస్సు డిపో వద్ద గుగ్గిళ్ల రోశయ్య అధ్యక్షతన ఏర్పాటైన దీక్షా శిబిరాన్ని కళ్యాణం వెంకటేశ్వర్లు,తుమ్మ విష్ణువర్ధన్, గడ్డం లింగమూర్తి లు ప్రారంభించారు.ప్రభుత్వం వెంటనే విలీన కమిటీని నియమించాలని, గుర్తింపు ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభుత్వం యాజమాన్యం అంగీకరించిన అంశాలను అమలు చేయాలని నినాదించారు. నిరాహార దీక్షలో గడ్డం వెంకటయ్య, పగిళ్లపల్లి నరసింహారావు, ఎన్.శ్రీనివాసు, మద్దెల బాబు, వి.శ్రీనివాసు,లక్ష్మీ భవాని, వి.రమేష్ కూర్చున్నారు.సమస్యలు వెంటనే పరిష్కరించాలని,కార్మిక సమస్యల పరిష్కారం పట్ల అలసత్వం వహిస్తే ఆర్టీసీ కార్మికులకు అండగా పోరాటంలో సిఐటియు



పాల్గొంటుందని తెలియజేశారు.వెంటనే న్యాయమైన ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని,వేతన బకాయిలు చెల్లించాలని,ఉద్యోగ భద్రత విధి విధానాలు రూపొందించాలని,కార్మికులు ప్రశాంతంగా విధులు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని,పెంచిన పని భారాలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

**టీఎంయూ సంఘీభావంలి**

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరాహార దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకత్వానికి ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఖమ్మం రీజినల్ అధ్యక్షులు గుర్రం ఉప్పలయ్య ఖమ్మం డిపో కార్యదర్శి మెరుగు రవీంద్రనాథ్ వారి జిల్లా డిపో కమిటీల నాయకత్వం దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం తెలియజేశారు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ చేస్తున్న పోరాటాన్ని వారు అభినందించారు. కార్మికుల పక్షాన చేసే న్యాయమైన పోరాటాలకు టీఎంయూ ఎల్లప్పుడూ సంఘీభావాన్ని,మద్దతును తెలియజేస్తుందని వారు ప్రకటించారు.

# గచ్చిబౌలిలో ఇద్దరు చిన్నారుల కిడ్నాప్ కలకలం

● గంటల వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు!



**టీ మీడియా, ఆగస్టు 2 5, హైదరాబాద్ బ్యూరో ;**
హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపిన ఇద్దరు చిన్నారుల అదృశ్యం ఉదంతం సుఖాంతమైంది. పోలీసులు వేగంగా స్పందించి గంటల వ్యవధిలోనే ఈ కిడ్నాప్ కేసును ఛేదించి, చిన్నారులను సురక్షితంగా రక్షించారు. గచ్చిబౌలిలోని రాఘవ ప్రాజెక్ట్ లేబర్ క్యాంప్ లో నివాసముంటున్న ప్రమీలా ముర్ము (4), సంగీత (3) అనే ఇద్దరు చిన్న పిల్లలను, వారితో పాటు పనిచేసే సహోద్యోగి చాకు సోరెన్ అపహరించాడు. షాప్‌నకు తీసుకెళ్లి మిఠాయిలు కొనిపిస్తానని నమ్మబలికి పిల్లలను తన వెంట తీసుకెళ్లాడు. ఎంతసేపటికీ వారు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకుండా పోయింది.

రాత్రి పొద్దుపోయినా పిల్లలతో పాటు చాకు సోరెన్ కూడా రాకపోవడంతో తీవ్ర భయాందోళనకు గురైన తల్లిదండ్రులు, అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు ఒంటి గంట ప్రాంతంలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, లేబర్ క్యాంప్ పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని నిశితంగా పరిశీలించారు. నిందితుడి కదలికలను సీసీటీవీ ఆధారంగా నిరంతరం ట్రాక్ చేస్తూ, అతడు రైలులో పారిపోవడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు.

పోలీసు బృందాలు సమయస్ఫూర్తితో వ్యవహరించి ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ వద్ద నిందితుడు చాకు సోరెన్‌ను చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఇద్దరు చిన్నారులను క్షేమంగా కాపాడారు. పిల్లలను సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సకాలంలో స్పందించి, అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తూ గంటల వ్యవధిలోనే తమ పిల్లలను దక్కించిన గచ్చిబౌలి పోలీసులకు బాధితులు, స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.